క్లుప్తంగా

పాఠశాలకు సౌండ్ సిస్టమ్ బహూకరణ

రాయవరం: మండలంలోని పసలపూడి కర్రి సుబ్బారెడ్డి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు సోమవారం దాత సహకారంతో సౌండ్ సిస్టమ్ సమకూరింది. గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి ఈ పాఠశాలకు రూ.50 వేల విలువైన సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రగతి రామారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామాభివృద్ధికి, విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రశంసించారు. కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం నూలు ఆదినారాయణ, పాఠశాల హెచ్ఎం కోరుమిల్లి వెంకటరమణ, ఎస్ఎంసీ చైర్మన్ తాడి లక్ష్మణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత పంటల పరిశీలన



కేదారిలంకలో వరద ప్రభావానికి గురైన ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న హెచ్ఓ, ఏఓ

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక, వీధివారిలంక గ్రామాల్లోని వరద ప్రభావిత ఉద్యాన పంటలను సోమవారం ఉద్యానశాఖాధికారి కోటేశ్వరరావు, ఏవో కేవీఎస్ రమేష్‌కుమార్ పరిశీలించారు. సుమారు వారం రోజుల పాటు ఉద్యాన పంటలన్నీ వరదలో మునిగి తేలాయి. వరదల సమయంలో లంక ప్రజలు, పశువుల సంరక్షణలో నిమగ్నమైన పలు శాఖల అధికారులు వరద వీడిన నేపథ్యంలో పంట నష్టం అంచనా వేసే పనిలో ఉన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు క్షేత్ర స్థాయిలో పంటల పరిస్థితులను పరిశీలిస్తున్నామని, పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

చివరి దశలో నాట్లు



వరినాట్లతో పచ్చదనంతో నిండిన పంట పొలాలు

కె.గంగవరం: మండల వ్యాప్తంగా ఇటీవల వర్షాలు విస్తారంగా కురవడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఇప్పటి వరకు వర్షాలు అంతంతమాత్రం పడినా రైతులను మాత్రం నిరాశ పరిచింది. అయితే గత వారం రోజుల క్రితం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు తొలకరి పనులను రైతులు ముమ్మరం చేశారు. మండల వ్యాప్తంగా 85 శాతం నాట్లు పూర్తయ్యాయని వ్యవసాయ అధికారులు తెలిపారు.

జగనన్న పాలనలో నేతన్నకు చేయూత



కాజులూరులో సీనియర్ చేనేత కార్మికులను సత్కరిస్తున్న సంఘ నాయకులు

కాజులూరు: సీఎం జగన్ పాలనలో రాష్ట్రంలో చేనేత కార్మికులకు తగిన చేయూత లభిస్తోందని కాజులూరు ఎంపీపీ మాత భారతి అన్నారు. సోమవారం గొల్లపాలెంలో స్థానిక పద్మశాలి సంక్షేమ సంఘం సభ్యులు జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించి కేక్ కట్ చేయగా కాజులూరులో సంఘ రాష్ట్ర నాయకులు కొల్లు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సభ్యులు జాతీయ, చేనేత జెండాలను ఆవిష్కరించి పలువురు సీనియర్ చేనేత కార్మికులను సత్కరించారు. 'నేతన్న నేస్తం' పథకం ద్వారా సీఎం జగనన్న నాలుగేళ్లలో రూ.969.77 కోట్లు పంపిణీ చేసి చేనేతలకు అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కుసునూరి రామకృష్ణ, బండారు సత్యనారాయణ, బొడ్డు వీరకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వార్డు సభ్యులకు 19న ఉప ఎన్నిక

మండపేట: వార్డు సభ్యుల ఆకస్మిక మృతితో మండలంలోని తాపేశ్వరం, ఏడిద గ్రామాల్లో ఖాళీగా ఉన్న రెండు స్థానాలకు ఈ నెల 19న ఉప ఎన్నిక నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఐ.రాజు తెలిపారు. అందుకోసం మంగళవారం నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలవుతుందన్నారు. ఈ మేరకు షెడ్యూల్ విడుదలైందని సోమవారం ఆయన తెలిపారు. 10వ తేదీ 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 11న పరిశీలన, 12న అభ్యంతరాలు, 14న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు తుది జాబితా ప్రచురణ ఉంటాయన్నారు. 19 ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోలింగ్, మధ్యాహ్నం రెండు గంటల నుంచి లెక్కింపు జరుగుతాయన్నారు. ఏడిదలో 1వ వార్డుకు, తాపేశ్వరంలో 14వ వార్డుకు ఉప ఎన్నిక జరుగుతున్నట్టు ఆయన తెలిపారు.

నులిమేద్దాం..

- 10న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- నులిపురుగుల నివారణ పద్ధతులపై అవగాహన
- క్షేత్ర స్థాయిలో అవగాహన సమావేశాలు

కపిలేశ్వరపురం: పిల్లల్లో పీలతనం, నీరసం, ఆహారం సరిగ్గా తీసుకోకపోవడానికి సహజమైన కారణం కడుపులో నులిపురుగులు ఉండడం. ఈ సమస్య పరిష్కారానికి దేశ వ్యాప్తంగా ఏటా మార్చి, సెప్టెంబర్ నెలల్లో రెండు సార్లు జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈ నెల 10, 17తేదీల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేస్తున్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రల వేసుకోవడంపై అవగాహన కల్పిస్తున్నారు.

ప్రభుత్వ శాఖల సమన్వయంతో..

ఏటా ఫిబ్రవరి 10న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం అవగాహన, ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేపడుతోంది. రెండో విడతగా సెప్టెంబర్‌లో మాత్రలు పంపిణీ చేస్తుంది. నులి పురుగుల ప్రభావం కారణంగా తలెత్తే రక్తహీనత నివారణ లక్ష్యంగా భాగంగా విద్య, మాతాశిశు సంక్షేమం, పంచాయతీ శాఖలతో పాటు జిల్లా పరిషత్‌ల సమన్వయంతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తారు.

మాత్ర ఎలా వేసుకోవాలో అవగాహన అవసరం

ఆరోగ్య సిబ్బంది ఇచ్చే 400 ఎంజీ ఆల్బెండజోల్ మాత్రను అవగాహనతో మింగాలి. రెండేళ్ల లోపు చిన్నారులకు సగం మాత్రను కరగ బెట్టి స్పూన్‌తో వేయాలంటూ ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. ఆపై వయసు బడినవారు పూర్తి మాత్రను నమిలి మింగాలి. మాత్రను పరగడుపున వేసుకుంటే కడుపులో తిప్పడం, వాంతులు అయ్యే అవకాశాలున్నందున ఆహారం తీసుకున్న తర్వాతనే మింగాలి.

క్షేత్రస్థాయిలో కార్యక్రమం ఇలా...

మండపేట నియోజకవర్గంలో 7, రామచంద్రపురం నియోజకవర్గంలో 9 పీహెచ్‌సీలు మొత్తం 16 పీహెచ్‌సీల పరిధిలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖలో 30 మంది వైద్యులు, 14 మంది ఫార్మసిస్టులు, వైద్య, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, ఐసీడీఎస్ అంగన్‌వాడీలు క్షేత్రస్థాయిలో ప్రభుత్వం సమకూర్చిన ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 1-19 సంవత్సరాల పిల్లలందరికీ ఈ మాత్రలు వేస్తారు. కపిలేశ్వరపురం మండలంలోని అంగర పీహెచ్‌సీ పరిధిలో 4,440, వాకతిప్పలో 2,200, అచ్యుతాపురంలో 1,939, రాయవరం మండలంలోని రాయవరం పీహెచ్‌సీలో 3,200 మాచవరం పీహెచ్‌సీలో 3,600, మండపేట మండలంలోని ద్వారపూడి పీహెచ్‌సీలో 7,500, కేశవరం పీహెచ్‌సీలో 6,800, మందికి మాత్రలను పంపిణీ చేయనున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలోని పామర్రు పీహెచ్‌సీలో 2,694, దంగేరు పీహెచ్‌సీలో 3,090, శేరిలంక పీహెచ్‌సీలో 126, రామచంద్రపురం రూరల్ మండలంలోని ద్రాక్షారామ పీహెచ్‌సీలో 7,600, కాజులూరు మండలంలోని దుగ్గుదూరు పీహెచ్‌సీలో 3,945, గొల్లపాలెం పీహెచ్‌సీలో 5,068 మందికి మాత్రలను అందజేయనున్నారు.

నులిపురుగుల ప్రభావం ఇలా...

పిల్లల కడుపులో కొంకి, నులి, బద్దె, గుండ్రని పురుగులు రక్తాన్ని పీల్చేస్తాయి. ఆ పురుగుల పునరుత్పత్తి, ఎదుగుదల మొత్తం మన కడుపులోనే జరగడంతో మనం తీసుకునే ఆహారాన్ని ఆ పురుగులు శోషించుకుంటాయి. దీనివల్ల పదేళ్ల మయస్సున్న వాళ్లలో ఎక్కువగా రక్తహీనత, పౌష్టికాహార లోపం, ఆకలి లేకపోవడం బలహీనత, కడుపునొప్పి, వికారం, వాంతులు, అతిసార, మలంలో రక్తం పడడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. శరీరంలో నులి పురుగులు ఉన్న పిల్లలు తమ మలంతో నేలను కలుషితం చేస్తారు. దీంతో వాటి గుడ్లు నేలలో లార్వాలుగా వృద్ధి చెందుతాయి. ఆహారం, మురికి చేతుల ద్వారా ఈ లార్వా చర్మం లోపలికి చొచ్చుకుపోవడం ద్వారా మిగతా పిల్లలకు నులి పురుగులు సంక్రమిస్తాయి. క్రిములు క్రమంగా అభివృద్ధి చెంది తిరిగి గుడ్లను ఉత్పత్తి చేసి పిల్లలకు అనారోగ్యం కలిగిస్తాయి.



పామర్రు ప్రాథమిక పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు



నులిపురుగులు

మాత్రతో దుష్ప్రభావాలుండవు



ఆల్బెండజోల్ మాత్రలను తీసుకోవడం వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవు. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత చేతులను శుభ్రం చేసుకుని మాత్ర వేసుకోవాలి. పెరిగిన గోళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి. పరిశుభ్రమైన నీటినే తాగాలి. పండ్లు, కూరగాయలు శుభ్రమైన నీటితో కడగాలి. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయకూడదు. భోజనం చేసే ముందు, మరుగు దొడ్డికి వెళ్లి వచ్చిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. చెప్పులు ధరించాలి.

–పి.రత్నకుమారి, వైద్యాధికారి, అంగర పీహెచ్‌సీ

కూర్మాపురంలో పోషణ కిట్ల పంపిణీ



కూర్మాపురంలో సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న సర్పంచ్ చక్రవేణి



నేలటూరులో పోషకాహార కిట్ల పంపిణీలో అధికారులు, ప్రజాప్రతినిధులు

రాయవరం: మండలంలోని కూర్మాపురంలో బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను సోమవారం పంపిణీ చేశారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ చౌటుపల్లి చక్రవేణి చేతుల మీదుగా టీహెచ్ఆర్‌లో భాగంగా లబ్ధిదారులకు ఈ కిట్లను అందజేశారు. . కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత చౌటుపల్లి వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు గండి పాపారత్నం, సునీత, ఆకుమర్తి సుజన, వైద్య ఆరోగ్య సిబ్బంది అడపా సుజాత, యడ్ల వెంకటలక్ష్మి, కాకి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేలటూరులో..

కపిలేశ్వరపురం: ఆరోగ్యవంతమైన మానవ సమాజ నిర్మాణానికి పోషకాహారం అత్యంత కీలకమని నేలటూరులో సోమవారం నిర్వహించిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. టేక్ హోమ్ రేషన్ కార్యక్రమం ప్రాధాన్యతను ఐసీడీఎస్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి వివరించారు. సర్పంచ్ కుక్కల వీరన్న, ఎంపీటీసీ సభ్యురాలు రుద్రాక్షుల వీరగౌరీకుమారి, ఉప సర్పంచ్ శనక్కాయల దొరబాబు చేతుల మీదుగా బాలింతలు, గర్భిణులకు పోషకాహార కిట్లను అందజేశారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ముగింపును పురస్కరించుకుని పిల్లల సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కేజేఎం జెస్సీ, వైఎస్సార్‌సీపీ నాయకులు కొప్పిశెట్టి కిశోర్, రుద్రాక్షుల శ్రీనివాస్, మహిళా పోలీస్ ప్రమీల పాల్గొన్నారు.

వరద సాయం పంపిణీ



శేరిలంకలో బాధితులకు ప్రభుత్వ సాయం అందిస్తున్న మంత్రి తనయుడు చెల్లుబోయిన నరేన్

కె.గంగవరం: మండలంలోని శేరిలంకలో సోమవారం రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణు తనయుడు చెల్లుబోయిన నరేన్ వరద బాధితులకు ప్రభుత్వ సాయాన్ని పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల వరద ఉధృతి వల్ల నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న రూ.2 వేల సాయాన్ని అందరికీ పంపిణీ చేశామన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా మండలంలోని శేరిలంక, కోటిపల్లి, కోట, బ్రహ్మపురి, మసకపల్లి గ్రామాలకు చెందిన సుమారు 1988 మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక సాయం మంజూరు అయిందన్నారు. ప్రస్తుతం శేరిలంకలో పంపిణీ పూర్తయిందని వెంటనే మిగిలిన గ్రామాల్లో కూడా పంపిణీ జరుగుతుందన్నారు. ఎంపీపీ పంపన నాగమణి, ఎంపీటీసీ కొండేపూడి గంగాభవాని, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, కన్వీనర్ కొండేపూడి చంటి, సర్పంచ్ భద్రరావు, తహసీల్దార్ వైద్యనాథశర్మ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి



ద్రాక్షారామలో గద్దర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రామచంద్రపురం రూరల్: విప్లవ కవి, ప్రజా గాయకుడు గద్దర్ మృతికి ద్రాక్షారామ జై భీమ్ దళిత సేవా సంఘం, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీల ఆధ్వర్యంలో సోమవారం ద్రాక్షారామ యానం సెంటర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘనంగా నివాళి అర్పించారు. గద్దర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేశారు. గద్దర్ సేవలను కొనియాడారు. గద్దర్ మరణించినా ఆయన పాటల రూపంలో ఎప్పటికీ జీవించే ఉంటారని అన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బి.సిద్ధూ, భీమశంకరం, అంబటి కృష్ణ, జై భీమ్ దళిత సేవా సంఘం అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, కార్యదర్శి దడాల వెంకటరమణ, వెంటపల్లి రామకృష్ణ, సాదే రాజేష్, పులుగు శ్రీను, బాల తదితరులు పాల్గొన్నారు.

భావితరాల భవిష్యత్తుకు కృషి



గొల్లపాలెంలో గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేస్తున్న నాయకులు

కాజులూరు: గర్భిణులకు పోషకాహారం అందించటం ద్వారా భావితరాల భవిష్యత్తుకు జగనన్న ప్రభుత్వం కృషి చేస్తుందని గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ మాత నాగరాజు అన్నారు. సోమవారం గొల్లపాలెం శివారు ధనలక్ష్మీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సిబ్బంది వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్‌లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవటం ద్వారా బిడ్డకు పోషకాహారం అంది భావితరం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యుడు పెంటపాటి శ్రీను, భీమన్న, స్థానిక పీఏసీఎస్ చైర్‌పర్సన్ మాత బోస్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓదూరు సర్పంచ్ ఉప ఎన్నికకు షెడ్యూల్ విడుదల

రామచంద్రపురం రూరల్: మండలంలో సర్పంచ్ మృతితో ఖాళీ అయిన ఓదూరు సర్పంచ్ ఖాళీకి ఉప ఎన్నిక నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేసినట్లు ఎంపీడీఓ ఎస్.షెలత్ రాజు, ఏఓ చాగంటి వెంకట అచ్యుతరామ సుబ్రహ్మణ్యంలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8 నుంచి 10 వరకు ఉదయం 10.30 గంటల నుంచి 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయడానికి అవకాశం ఉందన్నారు. 11న నామినేషన్‌ల స్క్రూటినీ, నామినేషన్‌లు విత్‌డ్రా చేసుకోవడానికి 14 వరకు అవకాశం ఉంటుందన్నారు. 19 న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌటింగ్ నిర్వహించి విజేతలను ప్రకటించడం జరుగుతుందన్నారు.

ఆత్మీయ స్వాగతం





గోదావరి ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ రాత్రి బస చేసేందుకు సోమవారం రాజమహేంద్రవరం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆర్ట్స్ కళాశాల మైదానంలోని హెలీప్యాడ్ వద్ద స్వాగతం పలుకుతున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

చేనేత వృత్తి భారతీయ నైపుణ్యతకు ప్రతీక



అంగరలో సీనియర్ చేనేత కార్మికులను సత్కరిస్తున్న నాయకులు



విజయవాడలో ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న మేనేజర్ సుబ్బారావు

కపిలేశ్వరపురం: చేనేత వృత్తి భారతదేశ నైపుణ్యతకు ప్రతీక అని జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు అన్నారు. సోమవారం చేనేత దినోత్సవం సందర్భంగా మండలంలోని అంగర, నల్లూరు, నేలటూరు గ్రామాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. అంగరలోని శ్రీగణపతి చేనేత పారిశ్రామికుల సహకార ఉత్పత్తి విక్రయ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అంగర గాంధీ సెంటర్లో నిర్వహించిన సమావేశంలో చేనేత వృత్తి పరిస్థితులను వివరించారు. చేనేత సహకార సంఘంలో సీనియర్ నేత వృత్తిదారులను ఘనంగా సత్కరించారు. నల్లూరు, నేలటూరు సహకార సంఘాల వద్ద చేనేత వస్త్రాల తయారీలో నూతన పద్ధతులను వివరించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, సంఘాల చైర్మన్లు గుడిమెట్ల శివరామకృష్ణ, సిద్ధాని వీరవెంకట సూరిబాబు, చల్లా చినబాబు, నాయకులు అతికెల శంభులింగం పాల్గొన్నారు.

అంగర చేనేత సొసైటీకి ప్రశంసలు

అంగర గ్రామంలోని శ్రీగణపతి చేనేత పారిశ్రామికుల సహకార ఉత్పత్తి విక్రయ సంఘానికి చేనేత, జౌళి శాఖ అధికారుల నుంచి ప్రశంస లభించింది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో అంగర చేనేత సహకార సంఘం మేనేజర్ కొలువుల సుబ్బారావు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

నాణ్యత, నూతన ఆకర్షణీయమైన డిజైన్లతో వస్త్రాల తయారీ చేస్తున్న కార్మికుల కృషిని చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సునీత, కమిషనర్ ఎంఎం నాయక్, ఎమ్మెల్సీ ఎం.హనుమంతరావు, గంజి చిరంజీవి, చిల్లాపల్లి మోహనరావులు ప్రశంసిస్తూ సహకార సంఘం ప్రతినిధిని సత్కరించారు.

మండపేట పట్టణంలో..

మండపేట: జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు, ఏడిదలోని రాజరాజేశ్వరి కైలాసేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ బేతా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంధుల పాఠశాలలో నిర్వహించిన ఈ వేడుకలకు ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రతినిధి బండారు బెనర్జీబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం బెనర్జీ బాబు తదితరులను వెంకటేశ్వరరావు సత్కరించారు. విద్యార్థులకు స్వీట్లు పంచి అన్నదానం చేశారు. చేనేత సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని దృష్టికి చేనేత సమస్యలు



ఆదివారపుపేటలో చేనేత వస్త్రాలు కొనుగోలు చేసిన బీజేపీ నాయకులు

రామచంద్రపురం రూరల్: చేనేత కార్మికుల సమస్యలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకు వెళతామని బీజేపీ నాయకులు తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని ప్రధాని మోదీ పిలుపు మేరకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దూడల శంకరనారాయణ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కేశవ రాఘవేంద్రరావు, కృష్ణమూర్తిలు ఆదివారపుపేట చేనేత కార్మికుల వద్దకు వెళ్లి చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు. చేనేత కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కిన దొరబాబు, పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరికలు

రామచంద్రపురం: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫస్ట్ ఇయర్ ప్రవేశాలు జోరుగా ప్రారంభమయ్యాయి. సోమవారం జరిగిన మొదటి కౌన్సెలింగ్‌లో రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆప్షన్ పెట్టుకున్న విద్యార్థులకు కళాశాలలో అడ్మిషన్లు కల్పించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత పేర్కొన్నారు.

శాంతియుత జీవనం అలవరుచుకోవాలి



విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మండపేట: ఒకరి భావాలను మరొకరు గౌరవించుకుంటూ శాంతియుత జీవనాన్ని అలవరుచుకోవాలని ఎంఈఓ సోమిరెడ్డి సూచించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక గౌతమి మున్సిపల్ హైస్కూల్లో సోమవారం హిరోషిమా, నాగసాకి దినోత్సవ వేడుకలు సోమవారం ఎంఈఓ సోమిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, డ్రాయింగ్ పోటీలకు 14 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 85 మంది విద్యార్థులు హాజరయ్యారు. స్కూల్ హెచ్ఎం శోభావళి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సోమిరెడ్డి మాట్లాడుతూ అణ్వాయుధాలు కాదని, అక్కున చేర్చుకునే మనస్సుండాలన్నారు. హెచ్ఓం శోభావళి మాట్లాడుతూ మానవ చరిత్రలో హిరోషిమా నాగసాకిపై అణ్వాయుధ దాడి జరిగిందన్నారు. శాస్త్ర సాంకేతిక మండలి ఆర్‌పీ కె రవికుమార్, కార్యక్రమం కోఆర్డినేటర్ ఎం రామలక్ష్మి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి శాస్త్రీయతతో ఆలోచించాలన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు డీఈఓ ఎం కమలకుమారి చేతుల మీదుగా బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివారు భూములకు సాగునీరందించాలి

కాజులూరు: శివారు భూములకు సాగునీరందించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు తదితరులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని గొల్లపాలెంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నీటి ఎద్దడి నేపథ్యంలో తూర్పు డెల్టా కాలువ శివారు భూముల్లో ఉన్న కాజులూరు మండల గ్రామాలకు తీవ్ర సాగునీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. ముఖ్యంగా శలపాక, దేగలపేట, గొల్లపాలెంలలోని కాలువల శివారు భూములకు చుక్కనీరు రావడం లేదన్నారు. అధికారులు సాగునీటి సరఫరాలో కాలువ శివారు భూముల పొలాలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ప్రత్యామ్నాయ చర్యలపైనా దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో మండల గ్రామాలకు చెందిన పలువురు కౌలు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

వచ్చే నెల 9న నేషనల్ లోక్ అదాలత్

రామచంద్రపురం: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 9న మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని కోర్టుల ప్రాంగణంలో నేషనల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవీదేవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నేషనల్ లోక్ అదాలత్ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, బ్యాంకు కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించామన్నారు. కక్షిదారులు అధిక సంఖ్యలో సెప్టెంబర్ 9న ఉదయం 10.30 నుంచి జరిగే లోక్ అదాలత్‌లో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. న్యాయవాదులు, బ్యాంకు, పోలీస్, రెవెన్యూ, బీఎస్ఎన్ఎల్, మున్సిపాలిటీ అధికారులు పాల్గొని ఎక్కువ కేసులు పరిష్కరించుటకు సహకరించాలని కోరారు.